ప్రయాణం.. నరకప్రాయం

- గుంతలమయంగా రహదారులు
- చినుకు పడితే చెరువుల్లా మారుతున్న రోడ్లు
- రోడ్డుపైకి రావాలంటేనే బెంబేలెత్తుతున్న వాహన చోదకులు

మైలవరం నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. ఇటీవల వచ్చిన వరదలకు రహదారులకు గండ్లు పడడంతో పాటు గోతులు ఏర్పడి అధ్వానంగా మారాయి. చినుకుపడితే చెరువుల్లా మారుతున్నాయి. భారీ గుంతలతో రహదారులు ఉండటంతో రోడ్డుపైకి రావాలంటేనే వాహన చోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

జి.కొండూరు: బుడమేరు వరద ప్రభావంతో జి.కొండూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా కందులపాడు క్రాస్ రోడ్డు నుంచి చేగిరెడ్డిపాడు, వెల్లటూరు మీదుగా బీమవరప్పాడు వరకు విజయవాడ–విస్సన్నపేట రహదారి పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. జి.కొండూరు నుంచి గంగినేని వరకు 15 కిలో మీటర్ల మేర ఉన్న కేజీవై రహదారిపై మోకాలి లోతు గుంతలు ఏర్పడి వర్షం నీరు చేరి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కట్టుబడిపాలెం నుంచి కవులూరు, కవులూరు నుంచి వెలగలేరు వెళ్లే రహదారి సైతం ధ్వంసమై వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల పరిధిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.



కందులపాడు గ్రామంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు



చేగిరెడ్డిపాడు వద్ద రహదారిపై ఏర్పడిన భారీ గుంత



వెల్లటూరు గ్రామంలో రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షం నీరు

రూ.78.58 కోట్లతో అంచనాలు

మైలవరం నియోజకవర్గంలో రహదారుల శాశ్వత మరతమ్మతుల కోసం అధికారులు ఇప్పటికే ప్రాథమిక అంచనాలను రూపొందించారు. మైలవరం డివిజన్ పరిధిలోని ఆర్అండ్‌బీకి సంబంధించి స్టేట్ హైవే శాశ్వత మరమ్మతుల కోసం 100 కిలో మీటర్లకు రూ.27.10 కోట్లు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 195 కిలో మీటర్లకు గానూ రూ.30.60 కోట్లు, పంచాయతీరాజ్‌కు సంబంధించి మైలవరం నియోజకవర్గ పరిధిలో రోడ్డు డ్యామేజీ 159 మీటర్లు, సర్ఫేస్ డ్యామేజీ 53.11 కిలోమీటర్లకు గానూ రూ.20.88 కోట్లతో శాశ్వత మరమ్మతుల కోసం అధికారులు అంచనాలను రూపొందించారు. ఈ దశ దాటక పోకపోవడంతో రహదారులు మరమ్మతులకు నోచుకోక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రహదారులకు మరమ్మతులు చేయాలి



రహదారులపై ఎక్కడ చూసినా మోకాలి లోతు గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రయాణం చేయాలంటే నరకం కనపడుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలి. రహదారుల గురించి గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన మేధావులు ఇప్పుడు రహదారులపై దృష్టి సారిస్తే ప్రజలు హర్షిస్తారు.

– పి. నాగమల్లేశ్వరరావు, 14వ వార్డు సభ్యుడు, జి.కొండూరు

తట్ట మట్టి కూడా వేయలేదు



జి.కొండూరు నుంచి గంగినేని వరకు ఉన్న రహదారి పూర్తిగా ధ్వంసమైంది. రాత్రి సమయాలలో ప్రయాణించాలంటే వణుకు పుడుతోంది. గత ప్రభుత్వంలో నిధులు రాలేదని పనులు ఆపేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా తట్ట మట్టి కూడా వేయలేదు. అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలి.

– కె అంజిరెడ్డి, గ్రామస్తుడు, మునగపాడు

నేడు 'మీకోసం'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీఓ మొవిడి వాణి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిస్తే పేర్కొన్న గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

ఇబ్రహీంపట్నం: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం ఇబ్రహీంపట్నంలో సోమవారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ కొండపల్లి మున్సిపాల్టీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఉదయం జరిగే సమావేశానికి మాజీ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరు గౌతంరెడ్డి హాజరవుతారన్నారు. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. పార్టీ వివిధ విభాగాల నాయకులు, వైఎస్సార్ కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

16 నుంచి నూతన మద్యం షాపులు

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వ నూతన మద్యం విధానాన్ని అనుసరించి ఈ నెల 16 నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయని తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వర్మ తెలిపారు. తిరువూరు నగర పంచాయతీలోని 4 దుకాణాలకు 182, తిరువూరు మండలంలో రెండు దుకాణాలకు 99, గంపలగూడెం మండలంలో నాలుగు దుకాణాలకు 269, ఎ.కొండూరు మండలంలో రెండు దుకాణాలకు 140, విస్సన్నపేట మండలంలో నాలుగు దుకాణాలకు 177 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. సోమవారం ఉదయం 8 గంటలకు విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్ఏసీ కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మద్యం దుకాణాల దరఖాస్తులు లాటరీ తీస్తారని వివరించారు.

క్లుప్తంగా

క్రీడలను ప్రోత్సహించాలి



నూజివీడు: క్రీడల వల్ల ఐకమత్యం, పోటీతత్వం అలవడతాయని, క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆర్డీఓ మొవిడి వాణి అన్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 72వ మహిళల, పురుషుల కబడ్డీ పోటీలను శనివారం రాత్రి ఆర్డీఓ వాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దసరా సందర్భంగా 72 ఏళ్లుగా కబడ్డీ పోటీలు నిర్వహించడం నూజివీడుకు గర్వకారణమన్నారు. పురుషుల ప్రారంభ మ్యాచ్ కృష్ణా, పశ్చిమ గోదావరి జట్ల మధ్య నిర్వహించగా, మ్యాచ్‌ను ఆర్డీఓ, చైర్‌పర్సన్‌లు తిలకించారు. ఫెస్టివల్ కమిటీ సెక్రటరీ పగడాల సత్యనారాయణ, దాసరి సూర్యనారాయణ, టీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఏఈ సాయిగణేష్ బదిలీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న సాయిగణేష్ తాడిగడప మున్సిపాల్టీకి ఆదివారం బదిలీ అయ్యారు. కొండపల్లి మున్సిపాల్టీలో వివిధ అభివృద్ధి పనుల కోసం ఆయన నిరంతరం కృషి చేశారు. ఇటీవలి కాలంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా కొంతకాలం ఆయన విధులు నిర్వర్తించారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

తిరువూరు: తిరువూరు పట్టణంలోని దేవాలయాల్లో భక్తులు హుండీలలో వేసిన కానుకలను సోమవారం లెక్కిస్తామని గ్రూపు దేవాలయాల మేనేజర్ ప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటలకు తిరువూరు వెంకటాచలస్వామి ఆలయంలో, సాయంత్రం చంద్రమౌళీశ్వరాలయం, రామలింగేశ్వరాలయాల్లో హుండీల కానుకలు లెక్కిస్తామని చెప్పారు. గన్నవరం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనూరాధ పర్యవేక్షిస్తారన్నారు.

పుస్తకాల పంపిణీ

గంపలగూడెం: స్వచ్ఛంద సంస్థల సేవలను విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొల్లె పోగు కిరణ్ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన జీవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవేశ, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయుక్తంగా లాంగ్ నోట్ పుస్తకాలను స్థానిక తూర్పు దళితవాడ కమ్యూనిటీ హాల్ వద్ద శనివారం పంపిణీ చేశారు. కిరణ్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత క్రమశిక్షణ, పట్టుదలతో చదివి మంచి ఉద్యోగాలు పొందాలని సూచించారు. అనంతరం వివిధ ఎంట్రన్స్ పరీక్షలకు హాజరయ్యే 150 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక ప్రత్యేక, ఈబీసీ ఎలిమెంటరీ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు.

నిత్యావసర సరకుల వితరణ

మైలవరం: మైలవరం పెద్ద రామాలయం ప్రాంగణంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో పేదలకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆర్య వైశ్య సంఘ నాయకుడు చారుగుళ్ల ప్రసాద్ మాట్లాడుతూ పేదలైన ఆర్య వైశ్యులు 20 మందికి ప్రతి నెలా నిత్యావసర సరుకులు దాతల సహకారంతో పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సంఘ కార్యదర్శి కాజా మహేష్, సభ్యులు అనుమోలు గాంధీ, జూలకంటి ప్రసాద్, చారుగుళ్ల ప్రసాద్, సూరిబాబు, చలువాది మధు, రాంబాబు, అప్పారావు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

నూజివీడు: పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 1977–78 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక జీపీ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ పోలీస్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావును మిత్రులు, బ్యాచ్‌మేట్లు కలిసి ఘనంగా సన్మానించారు. జీఎస్‌వీ ప్రసాద్, కౌన్సిలర్ కందుల సత్యనారాయణ, అప్పలరాజు, కర్నికుల వెంకటేశ్వరరావు, వడ్డి శివరామకృష్ణ, యర్రంశెట్టి శిరీష, నడికట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పార్థసారథి పర్యటన

నూజివీడు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సిమెంట్ రోడ్ల నిర్మాణ కార్యక్రమాల్లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఎంపీడీఓ సీ రాఘవేంద్రనాథ్ ఆదివారం తెలిపారు. ఉదయం 8 గంటలకు ఓగిరాల తండా, 8.30 గంటలకు వెంకటాయపాలెం, మధ్యాహ్నం 12 గంటలకు మిట్టగూడెంలో, 12.30 గంటలకు పడమర దిగవల్లిలో, సాయంత్రం 4 గంటలకు పోతురెడ్డిపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. ఉదయం 10గంటలకు ఆగిరిపల్లిలో డాక్టర్ సూరి భగవంతం విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

షిర్డీ సాయి సమాధి ఉత్సవం

ఆగిరిపల్లి: స్థానిక విజయవాడ రోడ్డులోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఆదివారం సమాధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సాయిబాబాకు విభూదితో అభిషేకం, భజన కార్యక్రమం అనంతరం బాబా వారికి పుష్పాలతో మహా సమాధి కార్యక్రమాన్ని నిర్వహించారు.

జయహో దుర్గాభవానీ



పెనుగొలనులో స్వామివార్ల కల్యాణం



గంపలగూడెం పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ



మైలవరంలో అమ్మవారి గ్రామోత్సవం



కొటికలపూడి రామాలయం వద్ద అన్నదానం



గంపలగూడెంలో శమీపూజలో పాల్గొన్న భక్తులు



చనుబండలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



కిలేశపురంలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో గంగానమ్మ



పెనుగొలను శివాలయంలో అమ్మవారి అలంకరణ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. పదో రోజు శనివారం అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల్లోని ఆలయాలు, చలువ పందిళ్లలో అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు భక్తులు తమ ఇళ్లల్లోనే శమీపూజ, ఆయుధ పూజ నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



విస్సన్నపేట ద్వారకానగర్‌లో రాజరాజేశ్వరీదేవిగా..



పుత్రేల మారెమ్మ దేవస్థానంలో రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు



నెమలిలో రాజ్యలక్ష్మి అమ్మవారికి రాజరాజేశ్వరీదేవి అలంకారం



బలివేలో రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



మునగపాడులో కనకదుర్గమ్మకు బోనాలు తీసుకువెళుతున్న భక్తులు



తిరువూరు కోదండ రామాలయంలో శమీ పూజలో పాల్గొన్న భక్తులు

బతుకమ్మకు పూజలు

గంపలగూడెం: దసరా పండుగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాలు, ప్రత్యేక శరన్నవరాత్రి శిబిరాల వద్ద నెలకొల్పిన బతుకమ్మకు మహిళలు శని, ఆదివారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో తయారు చేసిన పేర్పులను తీసుకువచ్చి బతుకమ్మ చుట్టూ ఉంచి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ అమ్మవారికి విశేష పూజలు జరిపారు. వివిధ రకాల వంటకాలను తయారు చేసి తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పలు చోట్ల బతుకమ్మను మేళతాళాలతో ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు.

కొండపర్వలో..

కొండపర్వ(విస్సన్నపేట): మండలంలోని కొండపర్వ గ్రామంలో దసరా సందర్భంగా పడమటి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బతుకమ్మలను మహిళలు తలపై పెట్టుకొని వీధుల్లో బతుకమ్మ ఆటలాడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.



తోటమూలలో బతుకమ్మను సాగనంపుతున్న భక్తులు



కొండపర్వలో బతుకమ్మ ఊరేగింపు

నూజివీడులో వైభవంగా దసరా





పట్టణంలో జనంతో కిక్కిరిసిన రోడ్లు (ఇన్‌సెట్) అమ్మవారి అలంకరణ

నూజివీడు: దసరా వేడుకలు నూజివీడులో శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక ఉయ్యూరు ఎస్టేట్‌లో జమిందారు వారసులైన మేకా మెహర్‌రామ్ వెంకటాద్రి అప్పారావు తొలుత ఆయుధపూజ నిర్వహించి అనంతరం జమ్మికొట్టి తుపాకీ పేల్చి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. చిత్ర విచిత్ర వేషధారణలు, కోలాట నృత్య ప్రదర్శనలు, బుట్టబొమ్మల సందడి, డప్పు వాయిద్యాల నడుమ విద్యుత్ కాంతులతో తెల్లవార్లు వీధులలో మహీషమ్మ అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. హంస వాహనంపై ఊరేగుతూ వచ్చిన మహీషమ్మను పట్టణ ప్రజలు దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఊరేగింపుతో పట్టణం భక్తులతో కిటకిటలాడింది. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు మద్యం షాపుల టెండర్ల లాటరీ

మైలవరం: నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల పరిధిలో మద్యం షాపులకు టెండర్‌లు వేసిన వారు సోమవారం ఉదయం విజయవాడ ఎన్ఏసీ కల్యాణ మండపం, గురునానక్ కాలనీలో నిర్వహించే లాటరీ ప్రదేశానికి తప్పని సరిగా ఉదయం 7 గంటలకు హాజరు కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జోశ్యుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్సుదారులు తమకిచ్చిన ఏ3బి, ఆర్1, ఎంట్రీ పాస్ లేదా ఆథరైజేషన్ విత్ ఫొటో, ఐడీ ప్రూఫ్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. లాటరీ రెండు హాల్స్‌లో ఏక కాలంలో.. ఒక హాల్లో గజెట్ సీరియల్ నంబర్ 1 నుంచి 54 వరకు రెండవ హాల్‌లో మైలవరం సర్కిల్ పరిధిలోని 55 నుంచి 113 వరకు ఎనిమిది గంటల నుంచి మద్యం షాపులకు లాటరీ ప్రారంభమవుతుందన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



ముసునూరు: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థినులు సత్తా చాటారని రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పీవీఎస్ రామకృష్ణారావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో అండర్–19 విభాగంలో పాల్గొన్న రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు నాగసుధ, జెస్సీ, ఇందుప్రియ ప్రతిభ చూపారని చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించడంలో ముఖ్య భూమిక పోషించిన విద్యార్థినులను, పీడీ వాకా నాగరాజును గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ముసునూరు: మండలంలోని చిల్లబోయినపల్లిలో మండల పాస్టర్ల ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా భీమడోలు సంసోన్, దుక్కిపాటి ఫ్రాన్సిస్, ప్రధాన, సంయుక్త కార్యదర్శులుగా మానికల రాజు, బొకినాల దాసు, కోశాధికారిగా ఏలేటి బాలస్వామి, కార్యవర్గ సభ్యులుగా దువ్వూరి జోజి, బొకినాల అబ్రహాం, ఎడ్వయిజర్‌గా దాసరి ప్రభుకిశోర్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షుడు బల్లవరపు యోహాను పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

నూజివీడు: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు నూజివీడు బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం గౌడ సంఘీయుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు మరీదు శివరామకష్ణ, మారగాని నారాయణరావు, కందుల కృష్ణ, ఆరేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

16 మంది అరెస్ట్

ఇబ్రహీంపట్నం: మండలం పరిధిలోని జూపూడి చినలంక, విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామాల్లో విజయదశమి పండుగ సందర్భంగా నిర్వహించిన కోడి పందేల శిబిరాలపై శనివారం పోలీసులు మెరుపుదాడి చేశారు. 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. 30 బైకులు, 10 కోళ్లు, 15 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరువూరు డివిజన్

99510 20399 (తిరువూరు,

99122 20544 (నూజివీడు)

90102 23734 (మైలవరం)

Office mail : sakshiads@gmail.com